# విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

### కలెక్టర్ జితేశ్ వి పాటిల్

పాల్వంచ రూరల్, మార్చి 8 : విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో ఉన్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆకాంక్షించారు. లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కళాశాల అటానమస్ గుర్తింపుతో డాక్టరేట్ పొందిన ప్రొఫెసర్ల సారథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. విశాలమైన క్రీడా మైదానం, లైబ్రరీ, ల్యాబ్ తదితర సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. అధ్యాపకులు చెప్పే పాఠాలు వింటూ విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధతో చదివితే ఉన్నత ఫలితాలు సాధించవచ్చన్నారు. డిగ్రీ విద్యనభ్యసించేందుకు విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా ప్రభుత్వ కళాశాలల్లో చేరి సమయం వృథా చేయకుండా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె.మాధవి, డి.రమేశ్, వేముల కామేశ్వరరావు, పీడీ పోట్లపువ్వు శ్రీనివాసరావు, ఎన్.శ్రీదేవి, దీపిక, హారిక తదితరులు పాల్గొన్నారు.


విద్యాసంవత్సర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

# జేకే 5 క్లోజ్..!

## చీకటిమయంకానున్న బొగ్గుగట్ట

ఆణిముత్యంలాంటి జేకే 5 ఓసీ గని ఈ ఉగాదికి మూతపడనుంది. బొగ్గు నిక్షేపాలు అయిపోవడంతో గనిని మూసివేసేందుకు సింగరేణి యాజమాన్యం సమాయత్తమైంది. దీంతో బొగ్గుకు పుట్టినిల్లు అయిన బొగ్గుట్ట(ఇల్లెందు) చీకటిమయంకానుంది. దేశానికి బొగ్గును మొట్టమొదటిసారిగా పరిచయం చేసిన ఇల్లెందు పేరు కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎంతోమందికి భవిష్యత్తుతోపాటు దేశానికి వెలుగులు నింపిన బొగ్గుట్ట నేడు అంధకారంలోకి వెళ్లనున్నది. ఇల్లెందు ఏరియాలో పరోక్షంగా జీవనోపాధి పొందుతున్న వ్యాపార, వాణిజ్యవర్గాలు సైతం ఆందోళనలో ఉన్నారు. ఒక్కొక్కటిగా ఇల్లెందులో ఉన్న గనులు మూతపడుతూ చివరిగా మిగిలిన జేకే 5 ఓసీ కూడా మూసివేత దిశగా ఉండడంతో ఇక్కడి ప్రజలు జీవనోపాధి కోసం వలసలు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

- ఇల్లెందు రూరల్, మార్చి 8


మూతపడనున్న జేకే 5 ఓసీ గని (ఫైల్)

- బొగ్గు నిక్షేపాలు అయిపోయినందున ఉగాదికి మూసివేత
- సమాయత్తమైన సింగరేణి యాజమాన్యం
- 250మంది కార్మికుల సర్దుబాటుకు సిద్ధం
- అగమ్యగోచరంగా కాంట్రాక్టు కార్మికుల దుస్థితి
- ఇంకా ప్రారంభంకాని పూసపల్లి ఓసీ

ఇల్లెందు ఏరియాకు గుండెకాయ లాంటి జేకే 5 ఓసీ గని ఉగాదికి ఇల్లెందుకు వీడ్కోలు చెప్పేందుకు సిద్ధమవుతున్నది. దీనికోసం అధికారులు ప్రయత్నాలు ప్రారంభించి పరోక్షంగా అల్టిమేటం జారీ చేస్తున్నారు. దీంతో కార్మికులు ఓసీ బంద్ అయితే విధుల కోసం ఏ ప్రాంతంలో సర్దుబాటు చేస్తారోనని మదనపడుతున్నారు. ఏరియాకు మిగిలింది ఇక కేవోసీ(కోయగూడెం ఓపెన్‌కాస్ట్) ఒక్కటే. జేకే 5లో పనిచేస్తున్న సుమారు 250మంది కార్మికులను కేవోసీకి బదిలీ చేసేందుకు యాజమాన్యం సిద్ధమైందని పలువురు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఒకవేళ అదే జరిగితే ఇల్లెందు నుంచి కేవోసీకి వెళ్లి విధులు నిర్వర్తించి తిరిగి మళ్లీ ఇల్లెందుకు ఉద్యోగులు చేరడం కష్టంతో కూడిన పని. అందరూ రిటైర్‌మెంట్‌కు దగ్గర ఉండడం, వయస్సు మీదపడడంతో కార్మికులు దూరప్రాంతాల్లో విధులు నిర్వహించడం కష్టం. ఇకపోతే జేకే ఓసీ పుణ్యమా అని పరోక్షంగా జీవనోపాధి పొందుతున్న మరో 100మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పర్మినెంట్ కార్మికులే సర్దుబాటు లేక తిప్పలు పడుతుంటే ఇక తమ పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు. తమను తీసివేస్తే కుటుంబాలు రోడ్డునపడతాయని బాధపడుతున్నారు. ఇల్లెందుకు చెందిన చిట్టచివరి గని జేకే 5 ఓసీ మూతపడితే పర్మినెంటు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకేకాక పరోక్షంగా వ్యాపారం నిర్వహిస్తున్న వ్యాపారవర్గాలు, వాణిజ్య సముదాయాలపై భయంకరంగా ప్రభావం ఏర్పడుతుంది. ఆర్థికంగా మరింత నష్టాన్ని ప్రజలు చవిచూడక తప్పదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పూసపల్లి ఓసీని వెంటనే ప్రారంభిస్తే కొద్దిమేర ఊరట లభిస్తుందని కోరుతున్నారు.


బొగ్గు లోడింగ్ చేస్తున్న కార్మికులు (ఫైల్)

### జేకే 5 ఓసీ చరిత్ర ఘనం..

బొగ్గుట్ట చరిత్రలోనే జేకే 5 ఓసీ ఓ తలమానికం. 1983లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జవహర్ ఖని(జే.కే)గా నామకరణం చేసింది. 1986లో ప్రొడక్షన్ పనులను ప్రారంభించారు. అంచెలంచెలుగా ఎదుగుతూ మంచి నాణ్యమైన బొగ్గును నాటి అధికారులు, కార్మికులు, సూపర్‌వైజర్లు ఉత్పత్తికి కృషిచేశారు. 1983 నుంచి 2007 వరకు అండర్‌గ్రౌండ్ మైన్‌గా ఉన్న జేకే గని ఆ తరువాత జేకే 5 ఓసీగా నామకరణం చేసి ఉపరితల గనిగా మార్చారు. సుమారు 24 సంవత్సరాలు అండర్‌గ్రౌండ్‌గా గని సేవలందించింది. తదనంతరం 2007–08 నుంచి నేటివరకు అనగా 18 సంవత్సరాలు నిరంతరాయంగా ఉపరితల గనిగా బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతను చేపట్టి ఇల్లెందు ఏరియాకు గుండెకాయలా పనిచేసింది. ఎన్నో అవార్డులు, రికార్డులు ఈ గని సొంతం చేసుకుంది. మొన్నటికిమొన్న దేశంలోనే అత్యుత్తమ గనిలో జేకే 5 ఫైవ్ స్టార్ రేటింగ్ అవార్డును సొంతం చేసుకుంది.



### పూసపల్లి ఓసీని త్వరగా ప్రారంభించాలి

ఇల్లెందు ఏరియాలో పూసపల్లి ఓసీని త్వరగా ప్రారంభిస్తే జేకే 5 ఓసీ గనిలో ఉన్న కార్మికులను అందులో సర్దుబాటు చేయవచ్చు. ఈలోపు జేకే 5 ఓసీని మూసివేస్తే కార్మికులకు ఇబ్బందులు తప్పవు. ఇల్లెందు పట్టణ ప్రాంతం పూర్తిగా ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతుంది. ఇతర ప్రాంతాలకు కార్మికులు వలస వెళ్తే కుటుంబాలు తరలిపోతాయి. ఇల్లెందు చిమ్మచీకటి అవుతుంది. అభివృద్ధి తిరోగమనం దిశగా ప్రయాణిస్తుంది.

**– జాఫర్‌ఖాన్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు, ఇల్లెందు ఏరియా**



### జేకే ఓసీ కాలపరిమితి పెంచాలి

మార్చి 31న జేకే ఓసీని మూసివేసేందుకు సింగరేణి యాజమాన్యం సిద్ధమవుతోంది. దీంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. అందరూ రిటైర్‌మెంట్ దగ్గరకు ఉండడం, వయసు రీత్యా వృద్ధాప్యంలో ఉన్నారు. నూతన ఓసీ ఏర్పాటయ్యే వరకు జేకే 5 ఓసీ కాలపరిమితి పెంచాలి. 2018లోనే ఓసీని బంద్ చేస్తామని సింగరేణి యాజమాన్యం నిర్ణయం తీసుకోగా టీబీజీకేఎస్ యూనియన్, బీఆర్ఎస్ నాయకులు నాటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి గనిని నడిపించే విధంగా చర్యలు తీసుకున్నారు. పూసపల్లి ఓసీ ప్రారంభమయ్యే వరకు జేకే ఓసీని కొనసాగించేలా గుర్తింపు సంఘం యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావాలి.

**– రంగనాథ్, టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ, ఇల్లెందు ఏరియా**



### కార్మికులు ఆందోళనకు గురవుతున్నారు..

జేకే 5 ఓసీ కార్మికులందరూ ఆందోళన చెందుతున్నారు. పర్మినెంట్ కార్మికులు సుమారు మూడువందల మందిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తే ఆరోగ్యపరంగా తీవ్ర సమస్యలు ఎదుర్కొంటారు. అందరూ రిటైర్‌మెంట్‌కు దగ్గరగా ఉన్నవాళ్లే. పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు సైతం పూర్తిగా నష్టపోతారు. యాజమాన్యం మరింత గడువును పెంచి నూతన ఓసీ ప్రారంభమయ్యేంత వరకు ఇక్కడే సర్దుబాటు చేయాలి.

**– యాకూబ్‌షావలి, టీయూసీఐ రాష్ట్ర నాయకుడు, ఇల్లెందు ఏరియా.**



### యాజమాన్యం పునరాలోచించాలి

సింగరేణి యాజమాన్యం ఇల్లెందు ఏరియా జేకే 5 ఓసీ గని మూసివేతపై పునరాలోచించాలి. కొంతమంది కార్మికులు బీపీ, షుగర్, గుండె, కిడ్నీ సమస్యలతో విధులకు హాజరవుతున్నారు. ప్రస్తుతం వీరందరూ పదవీ విరమణకు దగ్గరగా ఉన్నారు. చివరి సమయంలో వీరందరిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తారని భయాందోళన చెందుతున్నారు. నూతన ఓసీ ఏర్పాటు అయ్యేంత వరకు కార్మికులకు ఇక్కడే అవకాశం ఇవ్వాలి.

**– అబ్దుల్ నబీ, సీపీఎం నాయకుడు, ఇల్లెందు**

# లోక్ అదాలత్‌లో రాజీ ఎంతో ప్రయోజనం

### ఖమ్మం జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మం లీగల్, మార్చి 8 : లోక్ అదాలత్‌లో ఇరుపక్షాల రాజీ ఎంతో ప్రయోజనకరమని, కక్షిదారులకు మానసిక ప్రశాంతత లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ అన్నారు. శనివారం ఉదయం 10గంటలకు ఖమ్మం కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆయన మాట్లాడారు. ఇరువర్గాల కక్షిదారులు రాజీ పడితే వారికి వారి ఆర్థిక ప్రయోజనాలతోపాటు సమయం ఆదా అవుతుందని, కోపతాపాలకు పోకుండా రాజీ చేసుకోవడం ద్వారా గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుందన్నారు. కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ వేదిక అని, లోక్ అదాలత్ అవార్డు సుప్రీంకోర్టు అవార్డుతో సమానమని పేర్కొన్నారు. కక్షిదారులు అహం తగ్గించుకొని ఒకరికొకరు సహకరించుకోవడం ద్వారా కేసులు త్వరగా పరిష్కారమవుతాయన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా అదనపు జడ్జి కె.ఉమాదేవి మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని, మహిళల అభివృద్ధి కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమానికి న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ చంద్రశేఖరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరేళ్ల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి చింతనిప్పు వెంకట్, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

#### 19 వేల కేసులు పరిష్కారం

ఖమ్మం, మధిర, సత్తుపల్లి కోర్టుల్లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 13 బెంచీలను ఏర్పాటు చేశారు. క్రిమినల్ కేసులు 643, సివిల్ కేసులు 51, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద కేసులు 62, నష్టపరిహారంగా రూ.2 కోట్ల 71లక్షల 77 వేలు బాధితులకు అందజేశారు. ట్రాఫిక్ చలానాలు 16,169, బ్యాంకు రికవరీ 18, ఎస్‌టీసీ, పీఎల్‌సీ, ఈపీ 2,318 కేసులు, వివాహ సంబంధిత 6 కేసులు, సైబర్ కేసులు 78 మొత్తం 19,345 కేసులు పరిష్కారమయ్యాయి.


లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న భద్రాద్రి జిల్లా జడ్జి పాటిల్ వసంత్

### భద్రాద్రి జిల్లాలో 4,997 కేసులు పరిష్కారం : జిల్లా జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెం టౌన్, మార్చి 8 : జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 4,997 కేసులు పరిష్కారమైనట్లు జిల్లా జడ్జి పాటిల్ వసంత్ తెలిపారు. కొత్తగూడెంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్వర న్యాయం కోసం జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజీ మార్గంలో నడిచే వారే సమాజానికి మార్గదర్శకులని, వారు అభినందనీయులని అన్నారు. క్షణికావేశంలో చేసిన నేరాలతో కోర్టు చుట్టూ తిరిగితే విలువైన కాలం, డబ్బు వృథా అవుతుందని, కక్షిదారులు ఒక్క అడుగు రాజీ మార్గం దిశగా ప్రయత్నం చేస్తే ప్రతివాదులు రెండు అడుగులు తగ్గే అవకాశం ఉందన్నారు. అలాగే కొత్తగూడెంలో సివిల్ కేసులు 11, మోటార్ వాహన ప్రమాద కేసులు, క్రిమినల్ అప్పీల్స్‌కు రూ.3,27,90,000 జరిమానాతో పరిష్కారం లభించిందన్నారు. క్రిమినల్ 3,174, పీఎల్‌సీ కేసులు 310 కలిపి మొత్తం 3,495 కేసులు పరిష్కారమయ్యాయన్నారు. ఇల్లెందులో సివిల్ 6, క్రిమినల్ 278, పీఎల్‌సీ కేసులు 138 కలిపి మొత్తం 422 కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. భద్రాచలంలో క్రిమినల్ 653, పీఎల్‌సీ కేసులు 104 కలిపి మొత్తం 757 కేసులు పరిష్కారమయ్యాయని పేర్కొన్నారు. మణుగూరులో క్రిమినల్ 279, పీఎల్‌సీ కేసులు 44 మొత్తం కలిపి 323 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. లోక్ అదాలత్ సందర్భంగా కక్షిదారులకు ఎస్‌బీఐ, యూబీఐ ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్జిలు భానుమతి, బి.రామారావు, సాయిశ్రీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు తోట మల్లేశ్వరరావు, ఎంఎస్ఆర్ రవిచంద్ర, సాధిక్ పాషా పాల్గొన్నారు.







### పది నెలలైనా పూర్తి మరమ్మతుకు నోచుకోని జాలిముడి ఎడమ కాల్వ

### తాత్కాలిక పనులు చేసి చేతులు దులుపుకున్న అధికారులు

### మోటర్ల సాయంతో బోరు నీటిని పారించుకుంటున్న ఆయకట్టు రైతులు

### కాల్వకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని డిమాండ్

# జాలిముడి.. తడవని మడి!

మధిర, మార్చి 8 : జలకళను సంతరించుకున్న జాలిముడి ప్రాజెక్టు ఎడమ కాల్వ పరిధిలోని రైతుల పంట భూములకు నీరందని పరిస్థితి నెలకొన్నది. నిత్యం నీటితో తొణికిసలాడుతున్న ప్రాజెక్టు కింద అధికారుల నిర్లక్ష్యంతో మోటర్ల సాయంతో పంట భూములకు నీటిని పారించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని జాలిముడి గ్రామం వద్ద నిర్మించిన జాలిముడి ప్రాజెక్టు ద్వారా రైతుల పంట భూములకు సాగునీరు అందించేందుకు కుడి, ఎడమ కాల్వలు ఏర్పాటు చేశారు. వీటి కింద సుమారు 4,700 ఎకరాలకు నీరు పారించాల్సి ఉంది. అయితే జాలిముడి సమీపం నుంచి రొంపిమల్ల మల్లారం రైతుల భూముల్లో నుంచి ఎడమ కాల్వను పది అడుగుల లోతుతో తవ్వినా ప్రయోజనం లేకుండా పోయిందని రైతులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఎడమ కాల్వకు డిస్ట్రిబ్యూషన్ చానల్స్ ఏర్పాటు చేయకపోవడంతో సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు విద్యుత్ మోటర్లు, ఆయిల్ ఇంజిన్ల సాయంతో పంట పొలాలకు నీటిని పారించుకుంటున్నారు. అంతేకాక పది నెలల క్రితం తుఫాన్ కారణంగా వరద తాకిడికి 20 మీటర్ల మేర ఎడమ కాల్వ కాంక్రీట్ కొట్టుకుపోయింది. ఈ క్రమంలో కాల్వకు అటు, ఇటు కలుపుతూ రెండు 250 ఎంఎం ప్లాస్టిక్ పైపులైన్లను ఆనాడు నీటిపారుదల శాఖ అధికారులు అమర్చారు. ఆ పైపులైన్ ద్వారా సుమారు 2,700 ఎకరాలకు సాగునీరు సరఫరా కావాల్సి ఉంది. కానీ.. పైపులైన్‌కు నీరందకపోవడంతో కాల్వ పరిధిలో సాగు చేస్తున్న పంటలకు నీటి సరఫరా కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు రైతులతో కలిసి జాలిముడి ప్రాజెక్టును సందర్శించి కొట్టుకుపోయిన కాల్వలు, పూడుకుపోయిన తూములను పరిశీలించారు. వెంటనే పూర్తి స్థాయిలో కాల్వ మరమ్మతు చేసి సాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.


నీటితో కళకళలాడుతున్న జాలిముడి ప్రాజెక్టు


తుఫాను ప్రభావంతో కొట్టుకుపోయిన ఎడమ కాల్వ

### డిస్ట్రిబ్యూషన్ చానల్స్ లేక ఇబ్బందులు..



ఎడమ కాల్వకు ఎక్కడ కూడా డిస్ట్రిబ్యూషన్ చానల్స్ ఏర్పాటు చేయలేదు. దీంతో నీరందకపోవడంతో బోరు బావుల్లోని నీటిని మోటర్ల ద్వారా పారించుకుంటున్నాం. తుఫాన్ వల్ల కొట్టుకుపోయిన కాల్వకు పూర్తిస్థాయిలో మరమ్మతు చేయకపోవడం వల్లే ఇన్ని ఇబ్బందులు. వెంటనే అధికారులు మరమ్మతు చేపట్టి సాగునీరు సరఫరా అయ్యే విధంగా చర్యలు చేపట్టాలి.

**–బాదినేని వెంకటరామయ్య, రైతు, రొంపిమల్ల, మధిర మండలం**

### నీటి సరఫరా లేక పది నెలలు..



పది నెలలుగా జాలిముడి ప్రాజెక్టు ఎడమ కాల్వకు సాగునీటి సరఫరా నిలిచిపోయింది. వరదల కారణంగా ఎడమ కాల్వ కొట్టుకుపోయింది. అధికారులు దీనికి తాత్కాలికంగా పైపులైన్లు వేసి మరమ్మతు చేశారు. అయినా నీరు సరఫరా కావడం లేదు. చేసేది లేక బోరు బావులపై ఆధారపడి పంటలు సాగు చేయాల్సి వస్తున్నది. ప్రాజెక్టు ఉన్నా ప్రయోజనం లేకుండా పోయింది.

**–శీలం కృష్ణారెడ్డి, రైతు, జాలిముడి, మధిర మండలం**

# ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీగా సులానగర్

### డీపీవో చంద్రమౌళి


మాట్లాడుతున్న డీపీవో చంద్రమౌళి

టేకులపల్లి, మార్చి 8 : ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సులానగర్ గ్రామ పంచాయతీని ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీగా ఎంపిక చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) చంద్రమౌళి తెలిపారు. సులానగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఇందిరా మహిళా శక్తి సంబరాలు–2025ను సీడీపీవో కెఎం.తార ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో చంద్రమౌళి, సీడీపీవో తార మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, స్వయం సేవా సంఘాల ద్వారా రుణాలు పొంది స్వయంశక్తితో ఎదగాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలను నిర్మూలించాలని, ప్రతి ఆడపిల్ల ఉన్నత విద్యను అభ్యసిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఇంట్లో మహిళలు ఆరోగ్యంగా ఉంటే.. ఆ ఇంటి వాతావరణం ఆరోగ్యకరంగా ఉంటుందని, అందుకోసం మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కౌసల్యసింగ్, మంగతాయారు, రాజేశ్వరి, పద్మ, ఆశా వర్కర్లు చంద్రకళ, చైతన్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# పాలేరు నుంచి జలాలు విడుదల

### 18.75 అడుగులకు చేరిన రిజర్వాయర్ నీటిమట్టం

కూసుమంచి, మార్చి 8 : తగ్గుతున్న పాలేరు రిజర్వాయర్ నీటిమట్టాన్ని పెంచడం కోసం జిల్లాకు నీటిని నిలిపివేసిన అధికారులు తిరిగి శుక్రవారం రాత్రి నుంచి నీటిని విడుదల చేశారు. ఒక్కరోజు పూర్తిగా నీటిని నిలిపివేయడంతో 15.5 అడుగుల నుంచి 18.75 అడుగులకు పాలేరు నీటిమట్టం పెరిగింది. వేసవి తీవ్రత, నాలుగు జిల్లాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు, మరో నెల రోజులపాటు వరి తదితర పంటలకు నీటి అవసరాలు ఎక్కువగా ఉండడంతో ప్రస్తుతం రిజర్వాయర్‌కు సాగర్ నుంచి 6,055 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. పాలేరు నుంచి 4,606 కూసెక్కుల నీటిని వదులుతున్నారు. పాలేరు చానల్‌కు 230 క్యూసెక్కులు, మిషన్ భగీరథ తాగునీటి అవసరాలకు 135 క్యూసెక్కులు, భక్తరామదాసు ఎత్తిపోతల పథకానికి 275 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. పాలేరు ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లోకు మధ్య 757 క్యూసెక్కుల వ్యత్యాసం ఉండడంతో మరో నాలుగు రోజుల్లో మరో అడుగు వరకు నీటిమట్టం పెరిగే అవకాశం ఉంది.